క్లుప్తంగా

అలరించిన సంగీత కచేరీ

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో శ్రీరామసమాజం ఆధ్వర్యంలో గణపతి సంగీత హరికథా మహోత్సవాలు మంగళవారం ప్రారంభించారు. సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. పెద్దాడ శిష్య బృందం ఆలపించిన వాగ్గేయకారుల కీర్తనలు అలరించాయి. వీరికి వయోలిన్ విద్వాంసులు మహేంద్రవాడ నరసింహామూర్తి, మృదంగం విద్వాంసులు ఎ.అనిల్ కుమార్, ఘటం విద్వాంసులు సత్యవేగాలు చక్కని సంగీత సహకారం అందజేశారు. తదుపరి తెనాలికి చెందిన మెగిలిచర్ల నాగమణి భాగవతార్ 'దక్ష యజ్ఞం' హరికథ అలరించింది. వీరికి వాద్య విద్వాంసులు విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి, వారణాసి శ్రీనివాస్ సంగీత సహకారం అందించారు. అనంతరం సంగీత విద్వాంసురాలు ధనశ్రీ, పావని ఏర్పాటు చేసిన సంగీత కచేరి అలరించింది. వీరికి వాద్యకారులు గాయత్రి, కవి చెల్వాన్ సంగీత సహకారం అందజేశారు. సమాజం అధ్యక్షులు ఆకొండి శ్రీనివాసరాజారావు, కార్యదర్శి మనుగంటి వెంకట్రావు, భారత లక్ష్మీ, ద్విభాష్యం నాగేష్‌బాబు, ప్రభల రాజేశ్వరి, ఎస్‌కేవీడీ వెంకట్రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగిలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మంగళవారం విస్తృతంగా పర్యటించి పలు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. తూరంగిలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. తూరంగి సగరపేటలో సగర కమ్యూనిటీ హాలు నిర్మాణానికి, శెట్టిబలిజ పేటలో శెట్టిబలిజ కమ్యూనిటీ భవన నిర్మాణానికి, సీసీరోడ్డు, సీసీ డ్రైను నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సూర్యనగర్‌లో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ తదితర నిర్మాణాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. తూరంగి మాజీ సర్పంచ్ బలగం ప్రసన్న కుమార్, పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

రూరల్ నియోజకవర్గంలో పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టినట్టు ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం సాయంత్రం రూరల్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలోని మార్పులు, చేర్పు లు అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు కన్నబాబు మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు సంబంధించి సమాచారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు. వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కరప: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే కాకుండా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గొర్రిపూడిలో మంగళవారం రూ.1.64 కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రెయిన్లకు ఆయన భూమిపూజ చేశారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించి, ఇరు పక్కల సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్డు నిర్మించనున్నట్టు తెలిపారు. బుధవారం నుంచే పనులు ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో సత్వరమే పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎన్‌జీ రంగా వర్సిటీ బోర్డు సభ్యుడు చింతా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయిని విజయదుర్గకు సత్కారం

కాకినాడ సిటీ: రూరల్ మండలం తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కడలి విజయదుర్గను రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మంగళవారం అభినందించారు. స్థానిక పెద్దలు, నాయకులతో కలసి ఆమెను పాఠశాలలో సత్కరించారు. మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, తురంగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గొల్లపల్లి సూర్యప్రకాశరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వీట్ స్టాల్స్‌లో తనిఖీలు

కరప: గ్రామంలోని ఒక స్వీట్‌స్టాల్‌ను మంగళవారం కాకినాడ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. కొన్నిరకాల స్వీట్ల శాంపిల్స్‌ను పరీక్షల కోసం తీసుకువెళ్లారు. గ్రామంలో ఆత్రేయపురం పూతరేకులు పేరిట విక్రయిస్తున్న ఇంటిని తనిఖీ చేసి నమూనాలను తీసుకువెళ్లారు. స్వీట్‌స్టాల్స్‌లో విషపూరిత రసాయనాలు కలుపుతున్నట్టు వస్తున్న ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు.

బోయి భీమన్నకు ఘనంగా నివాళి

కాకినాడ రూరల్: బోయి భీమన్న జయంతి సందర్భంగా రమణయ్యపేట బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సోమవారం నివాళులు అర్పించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేయాలనే లక్ష్యంతో భీమన్న రచనలు చేశారన్నారు. సంక్షేమ సంఘ కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్, వెంకట్రావు, భాస్కరరావు, రెడ్నం రాజా, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని బుధవారం కిర్లంపూడిలోని తోట గోపాలకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా ఈ కార్యక్రమానికి హాజరవుతారని డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం తెలిపారు.



దిగుమర్తివారి వీధిలో పూజలందుకున్న చెరకు గడల గణపతి



భోగి గణపతి పీఠంలో కాంస్య కవచ ధారణలో..



దిగుమర్తివారి వీధిలో చెరుకుగడల గణపతిని దర్శించుకున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు



సూర్యారావుపేటలో గణనాథుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

విశిష్ట రూపా.. వినాయకా..

- నగరం అంతటా చవితి సందడి
- విశేషంగా దర్శించుకున్న భక్తులు
- వివిధ అలంకరణల్లో ఆకట్టుకున్న పందిళ్లు, స్వామివారి విగ్రహాలు



భోగి గణపతి పీఠంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



నడకుదురులో పంటకాలువపై నిలబెట్టిన వినాయకుని వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: నగరంలో జై గణేశా.. జైజై గణేశా నామం మార్మోగుతోంది. స్థానిక దిగుమర్తి వారి వీధిలో చెరుకుగడలతో తయారుచేసిన వినాయక విగ్రహం భక్తులను ఆకుట్టుకుంటోంది. ఆ స్వామి వారికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్ అయన వెంట దర్శనం చేసుకున్నారు. స్థానిక భోగి గణపతి పీఠంలో వినాయకుడికి కాంస్య కవచధారణ చేశారు. పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు పాల్గొన్నారు. స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయం ఆవరణలో ఉన్న వినాయకుడి ఆలయంలో స్వామికి, విద్యుత్‌నగర్‌లోని వినాయకుడి ఆలయంలో, ఎల్‌బీ నగర్ వినాయకుడి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అలాగే గాంధీనగర్, గాంధీనగర్ రైతు బజార్లలో ఏర్పాటు చేసిన వినాయకుడి ఆలయంలోను భక్తులు విశేష పూజలు చేశారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు) ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈఓ ఎం మురళీ వీరభద్రరావు ఏర్పాట్లు చేసి, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక సాలిపేటలోని వినాయకుని ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు.

కరప: మండలంలో సోమవారం వినాయక చవితి వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లోని గణపతి ఆలయాల వద్ద చలువ పందిళ్లు, టెంట్లు వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆయా విగ్రహాలను భక్తులు దర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. వేళంగి మార్కెట్‌సెంటర్, నిత్యానందపురం సెంటర్లలో వేసిన భారీ టెంట్లు ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో గోదావరి హారతి

గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదిదేవుడు, విఘ్నపతి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తూ ఆకట్టుకుంటున్నాడు. నడకుదురు అభయాంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న పంటకాలువపై ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం, ఎదురుగా కాలువపై శివలింగం భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ప్రధాన అర్చకుడు కాళ్లకూరి సాయి సుబ్రహ్మణ్యశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి పాయ ప్రవహించే పంటకాలువపై నిలబెట్టిన స్వామివారికి నిత్యం రాత్రి హారతి ఇస్తున్నారు. శ్రీబాల భక్తగణపతి స్వామి ఆలయకమిటీ సభ్యులు కోశెట్టి శ్రీనుబాబు, శ్రీనివాస్, తుట్టా రాజు, గాజుల ప్రవీణకుమార్ తదితరులు ఈ ఏర్పాట్లు చేశారు.

కాకినాడ రూరల్: నియోజవర్గంలో చవితి వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా చేసుకున్నారు. భక్తులు ఇళ్లలో, వ్యాపార సంస్థలు, ఆలయాలు, పలు వీధుల కూడళ్లలో పూజించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ విగ్రహాలు ఏర్పాటు చేసి గణపతి నవరాత్రులు చేపట్టారు. రమణయ్యపేట కాల్వ గట్టు వద్ద శ్రీ సిద్ధి వినాయక ఆలయం వద్ద యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన మహోత్సవాల్లో, సింహపురి కాలనీలోను, 3వ డివిజన్ సురేష్ నగర్‌లో జ్ఞాన్ మందిర్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో, ఫ్రెండ్స్ కాలనీలో, సూర్యారావుపేట వేడుకల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ సిటీ: నగర పరిధిలోని వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. కమర్షియల్‌రోడ్డు, ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద, జవహర్ జెట్టీ, వార్ఫు రోడ్డులో బ్రహ్మంగారి మఠం వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాలను మున్సిపల్, రెవెన్యూ, మత్స్యశాఖ, పోర్టు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్ బారికేడ్లు, గజ ఈతగాళ్లను భారీ క్రేన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర వైద్య బృందాలను ఉంచుతున్నామన్నారు. ఆర్డీవోతో పాటు డీఎస్పీ పడాల వెంకట మురళీకృష్ణారెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ సత్యకుమారి, అగ్నిమాపక అధికారి సుబ్బారావు, మత్స్యశాఖ అధికారి కరుణాకర్, నూకరాజు, పోర్టు ఇంజినీర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల మార్పుపై కసరత్తు

కాకినాడ: సిటీ నియోజకవర్గ పరిధిలో పోలింగ్‌స్టేషన్ల మార్పు అంశంపై మంగళవారం సాయంత్రం నగరపాలకసంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై స్టేషన్ల మార్పునకు వచ్చిన ప్రతిపాదనలపై చర్చించారు. రాజకీయ పార్టీలు ఇచ్చిన సూచనలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని ఈఆర్వో, కమిషనర్ నాగనరసింహారావు చెప్పారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

25న కూలి దండు ప్రదర్శన

కాకినాడ సిటీ: ఈనెల 25న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించే 22వ రాష్ట్ర మహాసభల్లో కూలిదండు మహా ప్రదర్శనకు జిల్లా నుంచి వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ఉపాధి కూలీలు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం సాంబమూర్తినగర్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభలు బాపట్ల జిల్లాలో జరుగుతున్నాయన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు కలెక్టర్ అభినందన



గోల్డ్ మెడల్ విజేత శ్రీనివాసరావును అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: దుబాయ్ ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 500 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించిన మండపల్లి శ్రీనివాసరావు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీఎస్ ఆర్టీసీ కాకినాడ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని మన కాకినాడకు మాత్రమే కాకుండా రాష్ట్రానికి, దేశానికి శ్రీనివాసరావు మంచి పేరు తీసుకొచ్చారని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి
- కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికురాలికి చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితంగానే ఇండియన్ స్మార్ట్ సిటీ అవార్డ్స్–2022 లో కాకినాడ దేశంలోనే రెండో స్థానాన్ని సాధించగలిగిందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక డి–కన్వెన్షన్‌లో సుమారు 1200 మంది పారిశుధ్య కార్మికులకు మంగళవారం మహిళా కార్మికులకు రెండు చీరలు, పురుషులకు రెండు జతల బట్టలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సీఎం జగన్ ఎన్నో పాలనా సంస్కరణలు అమలు చేస్తున్నారన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ ద్వారా చేపట్టిన చర్యలు ఎంతో సత్ఫలితాన్ని ఇస్తున్నాయన్నారు. కాకినాడకు రెండో ర్యాంక్ వచ్చిందంటే అది కూడా ఒక కారణమన్నారు. ఎన్నికలకు ముందు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తామని ప్రజలకు వాగ్దానం చేశామని, ఆ మేరకు కార్మికులు తమ బాధ్యతను అంకితభావంతో నిర్వర్తించడం వల్లే కాకినాడ పేరు దేశవ్యాప్తంగా రెపరెపలాడిందన్నారు. ఈ నెల 28న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి కలెక్టర్, కమిషనర్ అవార్డు అందుకోనున్నారని ఇది ఈ ప్రాంతానికి దక్కిన మంచి గౌరవమన్నారు. కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఇదే స్ఫూర్తితో మరింత కష్టించి పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న మాట్లాడుతూ తమ ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి కార్మికులు అందిస్తున్న సేవలకు సముచిత గౌరవం దక్కిందని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, మాజీ కార్పొరేటర్లు కంపర బాబీ, రాగిరెడ్డి బన్నీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


వినియోగంలోకి మరుగుదొడ్లు

బాలాజీచెరువు: నగరంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను వినియోగంలోకి వచ్చాయి. అలంకార ప్రాయంగా మారగా పలు మార్లు కథనాలు రావడంతో అధికారులు సద్వినియోగంలోకి తీసుకువచ్చారు. ఆర్‌టీఓ కార్యాలయం, సర్పవరం జంక్షన్, బాలాజీచెరువు, మెయిన్ రోడ్డు, కుళాయి చెరువు, గాంధీనగర్ పార్కు వంటి ప్రాంతాల్లో 12 పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయగా, మరికొన్ని ప్రాంతాల్లో 23 కమ్యూనిటీ టాయిలెట్లను (సీటీ) ఏర్పాటు చేశారు. వీటిని ఏర్పాటు చేసి దాదాపు ఏడాది దాటుతున్నా కొన్నింటిని ప్రారంభించగా, మరికొన్నింటిని ప్రారంభించకుండా తాళాలు వేసి ఉంచారు. ప్రస్తుతం నిత్యం జన సంచారం ఉండే ఆర్‌టీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన టాయిలెట్ అందుబాటులోకి తీసుకువచ్చారు. డీఈ మాధవి మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్వహణకు టెండర్లు పిలిచి ఏజెన్సీలకు అప్పగించినట్టు తెలిపారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

కాకినాడ: నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం నుంచి 23వ తేదీ వరకు 9 ప్రాంతాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, అప్డేట్ చేసుకోవడానికి మాత్రమే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్ అనుసంధానంతో పాటు బయోమెట్రిక్ అప్డేట్, పేరు, పుట్టిన తేదీల్లో మార్పులు, చిరునామాలో మార్పులు వంటి సేవలను అందిస్తారన్నారు. నగర పరిధిలో కృష్ణ నగర్ 2ఎ, డైరీఫారం 11 ఏ, గోలీలపేట 14 ఏ, యానాం రోడ్డు 15 ఏ, చిన్న మార్కెట్ 21 ఏ, యాళ్ల వారి వీధి 28 బి, బ్యాంకుపేట 32 ఏ, గాంధీనగర్ 38 ఎ, గైగోలు పాడు 50 బి సచివాలయాల పరిధిలో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేట కాల్వ గట్టు ప్రాంతానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు మోకా కృష్ణంరాజు, సీనియర్ నాయకుడు పాలిక శివ ఆధ్వర్యంలో రమణయ్యపేట కాల్వ గట్టు వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో కాళ్ళ శ్రీనివాస్, బొట్టా రాంబాబు, ముళ్లపాటి మధుబాబు, నకుడు గౌతమ్, పంచాంద్రాల శ్రీను, పాలిక రమేష్ తదితరులకు పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. పేదల సంక్షేమానికి సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటికి ప్రజలు సానుకూలంగా ఉన్నారన్నారు. రమణయ్యపేట అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని ఏ అవసరం వచ్చినా తన వద్దకు రావాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, నాయకులు గగారిన్, కేబుల్ వాసు, పెరుమళ్ళ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనల నుంచి 50 మంది..

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామం శెట్టిబలిజ పేటలోని 50 మంది శెట్టిబలిజ కులస్తులు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎ జగన్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై, ఎమ్మెల్యే కన్నబాబు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో ఈ పార్టీలో చేరినట్లు వివరించారు. పార్టీలో చేరినవారికి ఎమ్మెల్యే కన్నబాబు పార్టీ కండువా లు వేసి ఆహ్వానించారు.



టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వ్యక్తులకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు